కథ

# ఆలోచించండి

- పి.ఎస్.నారాయణ

సికింద్రాబాద్ స్టేషన్‌లో గోదావరి ఆగేటప్పటికి ఏడు గంటలయింది. సుదర్శనం విశాఖపట్నంలో నిన్న సాయంత్రం అయిదుంబావుకు ఎక్కాడు. ఇక్కడకు జేరేటప్పటికి గంట పైగా ఆలస్యం. బయటకు వచ్చి పదో నంబరు బస్సెక్కి కూకట్‌పల్లికి వచ్చేటప్పటికి మరో గంట.

సైడ్ బర్త్ రావటంతో రాత్రంతా సరిగ్గా నిద్రలేదు.

అయినా అతడికి చికాకు వేయటం లేదు, కూతురు వివాహ విషయంలో వెళ్ళిన పని మూడొంతులు అయిపోవటంతో. వాళ్ళు ఫోనులో, అంతకుముందే పంపిన జాతకం కుదిరిందని, అమ్మాయి ఫోటోలో నచ్చిందని చెప్పారు. దాని చదువు నచ్చింది. అది ఐటీలో ఏవేవో కోర్సులు చేసి ఇక్కడే ఉద్యోగం చేస్తోంది.

తనిప్పుడు విశాఖపట్నం వెళ్ళింది మర్యాదపూర్వకంగా వాళ్ళను కలిసి వాళ్ళ వివరాలు పూర్తిగా తెలుసుకుని తమ వివరాలు వాళ్ళకు చెప్పి, వాళ్ళందరినీ అమ్మాయిని చూడటానికి ఆహ్వానించడానికే.

ఒక మ్యారేజ్ బ్యూరో వాళ్ళిచ్చిన అడ్రసుల్లో ఇదొకటి. అక్కడకు వెళ్ళిన తనకు వాళ్ళెంతో మర్యాద చేశారు. పిల్లవాడూ చక్కగా మాట్లాడాడు.




ఇంట్లోకి వస్తుండగానే భార్య అడిగింది, ''కాయా? పండా?'' అంటూ.

''ఇంతవరకూ పండే!'' అన్నాడు కాళ్ళూచేతులూ కడుక్కుని వచ్చి మంచం మీద కూర్చుంటూ. భార్య కాఫీ తెచ్చి ఇచ్చింది.

''రెండిళ్ళున్నాయి.. ఒక్కడే కొడుకు మనకు సత్యవతి లాగానే. బ్యాంకులో ఏడేళ్ళబట్టీ చేస్తున్నాడు. రెండు సంవత్సరాల కిందటే ఆఫీసరయ్యాడు. మూడేళ్ళకొకసారి అక్కడికీ ఇక్కడికీ మారుస్తుంటారుకదా. అమ్మాయి ఉద్యోగం చేయాలనేం లేదన్నారు. విశాఖపట్నంలో ఉంటే మాత్రం వాళ్ళే ఎక్కడో అక్కడ ఇప్పించుకుంటామన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేటు.. ఎర్రగా పొడుగ్గా మనమ్మాయికి ఈడూజోడూగానే ఉన్నాడు. పిల్లవాడి తండ్రి కూడా బ్యాంకులోనే సీనియర్ మేనేజర్‌గా చేసి నాలుగేళ్ళ క్రితం రిటైరయ్యాడు. తల్లి పుట్టిల్లు మీ గుంటూరేనట!''

''కోరికలేమిటిట?''

''పెద్ద కట్నం ఆశ ఉన్నట్లుగా మాట్లాడలేదు. పెళ్ళి మాత్రం ఘనంగా చేయాలన్నారు. విశాఖపట్నంలో చేస్తే ఇంకా మంచిదన్నారు. వాళ్ళ బలగమంతా అక్కడే ఉన్నారట!''

''అదెట్లా కుదురుతుంది. మనకక్కడ తెలిసిన వాళ్ళెవరున్నారని, అలా అని ఒత్తిడి చేయరు కదా!''

''నేను చెప్పానులే. నలభై ఏళ్ళబట్టీ మేం ఉంటున్నది హైద్రాబాద్‌లోనే. అక్కడయితేనే మాకు సులువుగా ఉంటుంది. కొత్త ప్రదేశంలో మాకు చెయ్యాడదు అని- అయితే సరేలెండి అన్నారు''

''అమ్మాయిని ఎప్పుడు చూడటానికి వస్తారట''

''చెబుతున్నాను కదా. అది ఆనవాయితీగా ఒకసారి పిల్లాపిల్లాడు చూసుకుంటే బాగుంటుందని రావటమే. మన సంగతులన్నీ చెప్పాను. మా అమ్మాయిని ఫోటోలో చూశారు గదా, చిదిమి దీపం పెట్టుకోవచ్చు అన్నాను'' ఆమె ఆనందంగా ముసిముసి నవ్వులు నవ్వింది.

''దానికేమే లక్ష్మీదేవిలా వుంటుంది. మిగతావన్నీ కుదిరినప్పుడు అది నచ్చకపోవటమనే ప్రశ్నే రాదు. అయితే వాళ్ళేమన్నారంటే, హైదరాబాద్ రాలేమంటూ, మధ్యస్థంగా ఒక ఆలోచన చెప్పారు. ఈ నెలాఖరుకు ఆయన బావమరిది కొడుకుది విజయవాడలో వివాహమట. ఆ సమయంలో మనమూ పిల్లను తీసుకుని విజయవాడ వెళితే అక్కడే ఏదైనా హోటల్లో కూర్చుని ఆ కార్యక్రమం పూర్తి చేద్దాం లెండి అన్నారు. నాకు అది బాగానే వుందనిపించింది. సరే అని చెప్పాను. వాళ్ళు ఎప్పుడు బయల్దేరేది, అక్కడ ఎన్నాళ్ళుండేది ఫోను చేసి చెబుతామన్నారు. అదృష్టం బాగుండి అన్నీ కలిసొచ్చి సంబంధం నిశ్చయమైపోతే రేపు శ్రావణ మాసంలోనే పెళ్ళి చేసేయవచ్చు'' అన్నాడు తృప్తిగా సుదర్శనం.

''ఇంకేం.. గుంటూరులో వున్న మా అన్నయ్యను, వదినను కూడా రమ్మనమందాం. ఆయన ఇలాంటి విషయాల్లో అఖండుడు. ఒంటి చేత్తో ముగ్గురు కూతుళ్ళకూ పెళ్ళిళ్ళు చేసేశాడు. మీకసలే నోట్లో నాలికలేదు. తూర్పు వైపు వాళ్ళతో మనం కాస్త జాగ్రత్తగా మాట్లాడాలి'' అన్నది సంతోషంగా ఆమె కూడా. '' ఇడ్లీ వేయమంటారా? దోశలు పోసేనా, రాత్రి రైల్లో అసలు ఏమైనా తిన్నారా?''

''రైల్లో అమ్మేవి నాకేం తినబుద్ధి కాలేదు. రెండు అరటిపళ్ళు తిని పడుకున్నాను. ఏది తొందరగా అవుతుందనుకుంటే అది చేయి''

''అయితే దోశలే పోస్తాను గాని, ఈ లోగా అన్ని విషయాలూ ఒకసారి అమ్మాయి చెవిన వేయండి'' అంటూ వంటింట్లోకి వెళ్ళబోతూ కూతుర్ని పిలిచింది.

ఆఫీసుకు వెళ్ళేందుకు పక్కగదిలో తయారవుతున్న సత్యవతి వాళ్ళ మాటలన్నీ వింటూనే ఉన్నది. చివరకు తల్లి'నాన్న పిలుస్తున్నాడే' అన్న మాట వినగానే బయటకు వచ్చింది.

''మీ ఇద్దరికీ నచ్చితే నాకు నచ్చినట్లే నాన్నా! మీ ఇష్టమే నా ఇష్టం. అయితే, నాకో చిన్న అనుమానం వస్తున్నది. అబ్బాయి బాగుంటాడన్నారు. వాళ్ళకు అతనొక్కడే కొడుకంటున్నారు. రెండిళ్ళున్నయ్యన్నారు. కట్నం మీద కూడా అంతగా ఆశ లేదంటున్నారు. వాళ్ళుంటున్నదీ మహనగరమే కదా. ఏడేళ్ళ నుంచి ఉద్యోగం చేస్తున్నాడంటిరి. వాళ్ళ బలగమంతా అక్కడే ఉన్నారని వాళ్ళ నాన్న చెబుతుండే. అది అన్ని విధాల అంత మంచి సంబంధమైనప్పుడు, ఆడ పిల్లలున్న వాళ్ళ బంధువులుగాని, స్నేహితులు గాని అతగాడిని ఇన్నాళ్లూ ఎందుకు వదిలిపెట్టారట? మ్యారేజ్ బ్యూరో దాకా ఆయన వివరాలు ఎందుకు వెళ్ళవలసి వచ్చిందో మీరూ కాస్త ఆలోచించండి'' సత్యవతి ఆ నాలుగు మాటలు చెప్పి, ఆఫీసు టైం అవడంతో వడివడిగా బయటకు వెళ్ళిపోయింది. ❐